# సాక్షి
# మహబూబాబాద్

సోమవారం । 20 । జనవరి । 2025






**జాగ్రత్తలే శ్రీరామరక్ష!**

యూట్యూబ్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లలపై దుష్ప్రభావం పడే వీలుంది. వారిని నియంత్రించే చర్యలేంటో తెలుసుకుందాం.

-8లో▸



**ధాన్యం దొంగల గుట్టు రట్టు**

ధాన్యం దొంగల గుట్టును రట్టు చేసి రూ.4లక్షల విలువ చేసే వడ్లను నెల్లికుదురు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

-8లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం

32.2°/13.1°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### నేటి ప్రజావాణి రద్దు

**మహబూబాబాద్:** సంక్షేమ పథకాలకు సంబంధించి ఇంటింటి సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో ఈనెల 20న జరిగే ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అధికారులందరూ క్షేత్రస్థాయిలో పరిశీలనలో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి రద్దు చేశామన్నారు. జిల్లా ప్రజలందరూ ఈవిషయాన్ని గమనించాలన్నారు.

### రద్దీగా రైళ్లు..



**డోర్నకల్:** సంక్రాంతి సెలవులు ముగిసి ప్రజల తిరుగు ప్రయాణాలతో రైళ్లు రద్దీగా నడుస్తున్నారు. సికింద్రాబాద్ వైపు రైళ్లన్నీ రద్దీగా నడుస్తున్నాయి. ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకున్నవారు క్షేమంగా ప్రయాణిస్తున్నా.. రిజర్వేషన్ లేని ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనరల్ బోగీలన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.

### 25న సీపీఐ శతాబ్ది ఉత్సవాల సభ

**నెహ్రూసెంటర్:** జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరగనున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాల సభను విజయవంతం చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి పిలుపునిచ్చారు. ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి చిహ్నం, సాయుధ పోరాట వీరుడు, మాజీ ఎమ్మెల్యే తీగల సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హాజరవుతున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పెరుగు కుమార్, నవీన్, జ్యోతి, రమేశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



**నర్సింహులపేట:** అధిక దిగుబడుల కోసం సస్య రక్షణ చర్యలతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి మరియన్న అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించారు. తేనె మంచు నివారణకు లీటర్ నీటికి రెండు గ్రాముల ఎసిఫేట్ పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. మామిడి కాయల నాణ్యత కోసం పిందే దశలో ఫ్రూట్ బ్యాగింగ్ చేయాలని, దీంతో కాయలు అకర్షణీయంగా మంచి రంగుతో మార్కెట్‌లో గిరాకీ ఉంటుందన్నారు. మామిడి కాయలు పక్వ దశలో కోసి కార్బైడ్ రహితంగా మాగపెట్టి రైతులు మార్కెటింగ్ చేస్తే అధిక ఆదాయం వస్తుందన్నారు. వర్షాకాల ఆరంభంలో కొమ్మ కత్తిరింపులు చేసి, పచ్చి రొట్ట వేసి కలియదున్నాలని సూచించారు.

### పథకాల్లో ప్రత్యేక కోటా కేటాయించాలి



**మహబూబాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 20శాతం ఇళ్లు ఉద్యకారులకు కేటాయించాలని, అన్ని సంక్షేమ పథకాల్లో కూడా ప్రత్యేక కోటా కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబాబాద్ మండలంలోని అనంతాద్రి దేవాలయం నుంచి జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్తూపం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం అందజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యకారులదే కీలకపాత్ర అన్నారు. ఉద్యమకారులను గుర్తించాలని, అందుకోసం కమిటీ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నారాయణ్ సింగ్, శంతన్ రామరాజు, రాములు, హన్మంతు, వీరస్వామి, జగదీశ్వర్, జ్యోతిరెడ్డి, శ్యామల, జానకీరామ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయ లోపం!

- సీడబ్ల్యూసీ నిర్వాకంతో బాలకార్మికుల అవస్థలు
- నెలల తరబడి బాలసదనంలోనే..
- ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు

**మహబూబాబాద్:** బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడం, తప్పిపోయిన వచ్చిన పిల్లలను చేరదీసి వారి తల్లిదండ్రులు అప్పగించడం కోసం జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీతో పాటు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ ఏర్పాటు చేశారు. కాగా జిల్లా సీడబ్ల్యూసీ సభ్యులు ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. వారిలో సమన్వయలోపం, ఇతర కారణాల వల్ల బాలకార్మి కులకు ఇబ్బందులు తప్పడం లేదు. తల్లిదండ్రులకు అప్పగించకుండా నెలల తరబడి వారిని బాలసదనంలోనే ఉంచుతున్నారు.

**జిల్లాలో రెండు బృందాలు..**

జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బాలరక్షా భవన్‌ను ఏర్పాటు చేశారు. దానిలోనే సీడబ్ల్యూసీ (చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ), జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్‌తో పాటు పలు విభాగాల నిర్వహణ కొనసాగిస్తున్నారు. బాలరక్షక్ వాహనం కూడా కేటాయించి అందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రతీ సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లాలో డివిజన్‌కు ఒకటి చొప్పున రెండు డివిజన్‌లకు గాను రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి టీంలో ఎస్సైతోపాటు ముగ్గురు కానిస్టేబుళ్లు, బాలల పరిరక్షణ విభాగం నుంచి ఒకరు, లేబర్ ఆఫీస్ నుంచి మరొకరు ఉంటారు.

**సీడబ్ల్యూసీ విధానం ఇలా..**

సీడబ్ల్యూసీలో చైర్‌పర్సన్‌తోపాటు ఐదురుగు సభ్యులు ఉండాలి. కానీ జిల్లాలో చైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు సభ్యులు మాత్రమే ఉన్నారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌తో పాటు పలుమార్లు ఆ బృందాలు షాపులు, క్వారీలు, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి బాలకార్మికులను గుర్తించి బాల రక్షాభవన్‌కు తరలిస్తున్నారు. వారి ఆధార్‌కార్డు ఆధారంగా చర్యలు తీసుకుంటున్నారు. బాలకార్మికులను సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరుస్తున్నారు. కాగా కమిటీ బాలకార్మికుల పూర్వపరాలను పరిశీలించి బాలల కోర్టు మాదిరిగా నిర్ణయం తీసుకుంటారు. ఇతర రాష్ట్రాల బాలకార్మికులు ఉంటే.. ఆయా రాష్ట్రాల్లోని జిల్లాల సీడబ్ల్యూసీ కమిటీలకు పిల్లల వివరాలు తెలియజేస్తారు. వారు 15 రోజుల్లో ధ్రువీకరించి పూర్తి వివరాలు పంపాలి. ఆ తర్వాత ఆ బాలకార్మికులను 15రోజులలోపు వారి ఇంటి వద్ద దింపిరావాల్సి ఉంటుంది. జిల్లాకు చెందిన వారిని తల్లిదండ్రులు వస్తే అప్పగించవచ్చు.

**కమిటీపై ఆరోపణలు..**

చట్టాన్ని అతిక్రమించి సీడబ్ల్యూసీ నిర్ణయాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. బాలకార్మికులను బాలసదనానికి తీసుకొచ్చిన తర్వాత వారి తల్లిదండ్రులు, షాపుల యజమానుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని వదిలిపెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బాల్యవివాహాలు, ఇతర విషయాల్లో కూడా అధికంగా డబ్బులు తీసుకుని వదిలిపెడుతున్నట్లు సమాచారం. కాగా పెద్ద ఎత్తున డబ్బులు వసూల్ చేస్తున్న కమిటీపై విచారణ జరపాలని బాలకార్మికుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలోని బాల రక్షాభవన్



బాల రక్షాభవన్‌లో బాలకార్మికులు

**కమిటీలో సమన్వయంలోపం..**

సీడబ్ల్యూసీ సభ్యుల మధ్య సమన్వయలోపంతో బాల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 15వ తేదీ లోపు 9మంది బాల కార్మికులను తీసుకువచ్చారు. వారిలో ఏడుగురు జిల్లాకు చెందిన వారు ఉండగా... ఇందులో ఐదుగురిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు కమిటీ సభ్యులు డేవిడ్, డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు. ఇద్దరు జిల్లాకు చెందిన వారితో పాటు ఒకరు రాజస్తాన్, మరొకరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఉన్నారు. అలాగే గురువారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాలకార్మికుడిని పట్టుకొచ్చారు. కాగా బాలసదనంలో పిల్లలను నెలల తరబడి ఉంచుతున్నట్లు సమాచారం.

**బడ్జెట్ ఉన్నా బాలసదనంలోనే..**

ఇతర రాష్ట్రాలకు చెందిన బాల కార్మికులను వారి ఇంటికి పంపేందుకు బడ్జెట్ ఉన్నా బాలల పరిరక్షణ విభాగం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ముందుగా డబ్బులు ఖర్చు పెట్టి వారిని ఇంటికి పంపిన తర్వాత బిల్లులు పెడితే వెంటనే విడుదల అవుతాయి. కానీ ఖర్చు పెట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వారు బాలసదనంలో నెలల తరబడి ఉండాల్సి వస్తోంది.

**బడ్జెట్ ఉన్నా నిర్లక్ష్యం చేస్తున్నారు..**

ఇతర రాష్ట్రాలకు చెందిన బాలకార్మిలను వారి స్వస్థలాలకు పంపేందుకు బడ్జెట్ ఉంది. ఆవిషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. చేసిన ఖర్చు బిల్లులు పెడితే వెంటనే అప్రూవల్ అవుతుంది. కమిటీపై ఆరోపణలు వస్తున్నాయి. విచారణ చేస్తాం.

- దనమ్మ, డీడబ్ల్యూఓ

**నిబంధనల మేరకు పని చేస్తున్నాం..**

నిబంధనల మేరకు కమిటీ పని చేస్తోంది. గతంలో ఇతర రాష్ట్రాలకు చెందిన బాల కార్మికుల విషయంలో మానవతా దృక్పథంతో తల్లిదండ్రులు రాగానే పంపించాం. కానీ ప్రస్తుతం వస్తున్న ఇబ్బందులతో చట్ట ప్రకారం బాలసదనంలో ఉంచి ప్రాసెస్ పూర్తి అయిన తర్వాతనే పంపిస్తున్నాం.

-డాక్టర్ నాగవాణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్

# గ్రామస్థాయిలో మెరుగైన వైద్యం



హెల్త్ క్యాంపులో మంత్రికి బీపీ చెక్ చేస్తున్న వైద్యులు



క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రి సీతక్క

- మంత్రి ధనసరి సీతక్క
- గంగారంలో మెగా హెల్త్ క్యాంపు

**గంగారం:** గ్రామస్థాయిలో పేదప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు మెగా హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గిరిజన బాలల ఆశ్రమోన్నత పాఠశాలలో మెగా మెడికల్ క్యాంపును ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క హాజరై ప్రారంభించారు. అనంతరం బీపీ చెక్ చేయించుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాట చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మారుమూల పల్లె ప్రజలు పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఖమ్మం తదితర పట్టణాల నుంచి వైద్యులను రప్పించి పోలీసుల ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్యాంపునకు సుమారు ఐదు వేల వరకు ప్రజలకు హాజరై వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. హెల్త్ క్యాంపు వద్ద ప్రజలకు భోజన సదుపాయం కల్పించారు. అనంతరం కొత్తగూడ, గూడూరు, గంగారం మండలాల్లో ఇటీవల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో ఉత్తమ ప్రతిభన కనబర్చిన క్రీడాకారులకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందించారు. అలాగే వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్లనాయక్, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, మహబూబాబాద్ ఐఎంఏ ప్రెసిడెంట్ జగదీష్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాద్, సీఐలు సర్వయ్య, రవికుమార్, బాబురావు గిరిధర్‌రెడ్డి, ఎస్సైల సతీష్, మురళీధర్‌రాజ్, దీపిక, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణరెడ్డి, కొత్తగూడ, గంగారం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు వజ్జ సారయ్య, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

**మహబూబాబాద్ అర్బన్:** ఇటీవల విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులకు ఉద్యమ చరిత్ర, సమకాలిన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఉమ్మడి ఉద్యమాల నిర్మాణంలో ఏపీటీఎఫ్ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమమే కాకుండా విద్యారంగ అభివృద్ధి, సామాజిక సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మైస శ్రీనివాసులు మాట్లాడుతూ.. నూతన ఉపాధ్యాయులు విద్యారంగ సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్, ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీశైలం, ఐలయ్య, సువర్ణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఉపేందర్, జిల్లా కార్యదర్శులు ఆర్.ఉపేందర్, రవీందర్, జనార్దన్, సబియాభాను, శ్రీలత, వివిధ మండలాల బాధ్యులు రామలింగారెడ్డి, బాబూరావు, విద్యాసాగర్, విజయ్‌కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

## గ్రామ సభలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

**మహబూబాబాద్:** గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా పథకాలు మంజూరు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం రాత్రి నాలుగు ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21నుంచి 24వరకు నిర్వహించే గ్రామ సభలకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికి రేషన్‌కార్డు జారీ చేయాలన్నారు. ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

## సంక్షేమ పథకాలు అందేలా కృషి

- ఏజెన్సీ గౌడసంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కనకయ్య

**బయ్యారం:** మైదాన ప్రాంత గౌడ కులస్తులతో సమానంగా ఏజెన్సీలోని గౌడ కులస్తులకు ప్రభుత్వ పరమైన అన్ని సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయంలో ఏజెన్సీ ప్రాంతాల గౌడ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని మిగతా బీసీ కులాలకు సొసైటీలు ఉన్నప్పటికీ గౌడ కులస్తులకు సొసైటీని గత ప్రభుత్వం పునరుద్ధరించలేదన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఏజెన్సీలోని గౌడ కులస్తులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. గౌడ పరిరక్షణ కమిటీ నాయకులు నర్సయ్యగౌడ్, వెంకన్న, వెంకటేశ్వర్లు, సత్యం, రాజన్న, శ్రీను, రాంమూర్తి, నర్సయ్య, రమేశ్, యాకయ్య, రవి, వీరన్న, సారయ్య, వీరవెంకులు, వినయ్‌బాబు, పరదేశి, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

## మద్దతు ధరల చట్టం చేయాలి

- ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వెంకట్రామయ్య

**నెహ్రూసెంటర్:** రైతుల పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేసి ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు అఖిల భారత రైతు కూలీ సంఘాల (ఏఐకేఎంఎస్) విలీన సభ సందర్భంగా జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వెంకట్రామయ్య మాట్లాడుతూ... మద్దతు ధర లేక అప్పుల ఊబిలో చిక్కుకుని రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని అప్పగించేలా చట్టాలను మారుస్తున్నారని ఆరోపించారు. మద్దతు ధర, చట్టాలు అమలు చేయాలని రైతులు ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వాలు మాత్రం నిర్బంధాలు ప్రయోగిస్తూ, దేశ ద్రోహులని ముద్ర వేస్తున్నారని విమర్శించారు. రైతు భరోసా, పోడు భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది దాటిన రైతులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలు చేసి వ్యవసాయ రంగ చట్టాలు, ఎంఎస్‌పీ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మండల వెంకన్న, గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. కోటేశ్వర్ రావు, భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటరామి రెడ్డి, సత్యం, రాజు, సత్యనారాయణ, లాల్‌కుమార్, డేవిడ్‌కుమార్, భూమన్న, నందగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వెంకట్రామయ్య

# డాక్టర్లు కావలెను..

- గార్ల సీహెచ్‌సీలో 10మందికి.. ఉన్నది ముగ్గురే వైద్యులు
- రాత్రి సమయంలో రోగుల ఇబ్బందులు
- ఆస్పత్రిలో వేధిస్తున్న మందుల కొరత

**గార్ల:** మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో మెరుగైన సౌకర్యాలు కల్పించినప్పటికీ.. సరిపడా వైద్యులు లేకపోవడంతో రోగులకు వైద్యం అందడం లేదు. 10మంది డాక్టర్లు ఉండాల్సిన ఆస్పత్రిలో ముగ్గురు మాత్రమే సేవలు అందిస్తారు. అదికూడా రాత్రి సమయంలో డాక్టర్లు అందుబాటులో ఉండకపోవడంతో అత్యవసర వైద్యం కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఇద్దరు డిప్యుటేషన్‌పై..**

ఆస్పత్రిలో ఉన్న ముగ్గురు డాక్టర్లలో ఇద్దరు డిప్యుటేషన్‌పై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉంది. సెలైన్ బాటిల్ పెట్టేందుకు సెలెన్ కిట్లు, సిరంజీలు అందుబాటులో లేకపోవడంతో రోగులు బయట మెడికల్ షాపులకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.



గార్ల సీహెచ్‌సీ


**బదిలీతో..**

గార్లలో ఐదేళ్లక్రితం సకల సౌకర్యాలతో రూ.5 కోట్లు వెచ్చించి 30 పడకల ఆస్పత్రిని నిర్మించారు. రెండేళ్లక్రితం ఆస్పత్రి వైద్య విధాన పరిషత్‌కు అప్‌గ్రేడ్ అయింది. మహబూబాబాద్ ఆస్పత్రి నుంచి వైద్యులను డిప్యుటేషన్‌పై ఇక్కడికి పంపారు. మొత్తం 10మంది డాక్టర్ల ద్వారా మండల ప్రజలు సీహెచ్‌సీలో ఏడాది పాటు సక్రమంగా వైద్యసేవలు పొందారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం 9నెలల క్రితం డాక్టర్ల బదిలీ ప్రక్రియ చేపట్టింది. ఇక్కడి నుంచి 9మంది బదిలీపై వెళ్లారు. ఇక్కడికి రావడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. ఆస్పత్రిలో ఒక డాక్టర్ మాత్రమే మిగలడంతో, జిల్లా ఆస్పత్రి నుంచి మరో ఇద్దరు డాక్టర్లను డిప్యుటేషన్‌పై పంపారు. అయితే ఈ ముగ్గురు డాక్టర్లు ఉదయం వచ్చి మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లిపోతున్నారు. రాత్రి సమయంలో ఆస్పత్రిలో నర్సులు తప్ప డాక్టర్లు ఎవరూ ఉండటం లేదు. సీహెచ్‌సీకి ప్రతీరోజు 250 నుంచి 300 వరకు ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ఇప్పటికైనా స్థానిక ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ స్పందించి గార్ల సీహెచ్‌సీలో వెంటనే డాక్టర్ల ఖాళీలను భర్తీ చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఓపీలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ హనుమంతరావు(ఫైల్)

## సాగు భూములను గుర్తించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణవేణి

**గార్ల:** రైతు సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వం రైతులకు అమలు చేసే రైతుభరోసా కోసం అధికారులు సాగుకు యోగ్యమయ్యే భూములను మాత్రమే గుర్తించాలని మహబూబాబాద్ ఆర్డీఓ కృష్ణవేణి ఆదేశించారు. ఆదివారం మండలంలోని సేరిపురం, మర్రిగూడెం, బుద్దారం పంచాయతీల్లో కొనసాగుతున్న పంట భూముల సర్వేను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాగుకు యోగ్యంగా లేని బీడు భూములు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకు రైతు భరోసా పథకం రాదన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రవీందర్, ఏఓ కావటి రామారావు, ఏఈఓ కిరణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**భూముల పరిశీలన**

**బయ్యారం:** అర్హులకు రైతుభరోసా పథకం అమలు జరిగేలా అధికారులు ఆదివారం బయ్యారంలో క్షేత్రస్థాయిలో భూముల పరిశీలన నిర్వహించారు. బయ్యారం, జగ్గుతండా పంచాయతీల పరిధిలో వ్యవసాయం చేయకుండా రియల్‌వెంచర్లు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న భూములను సర్వే నంబర్ల ఆధారంగా గుర్తించారు. ఆర్డీఓ కృష్ణవేణి, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ విజయ, ఏఓ రాంజీ, సర్వేయర్ శివ పాల్గొన్నారు.

## కనీస వేతనం అమలు చేయాలి

- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

**నెహ్రూసెంటర్:** పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దుతూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర రెండో మహాసభలను ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు సలాం కొట్టడం, సన్మానాలు చేయడం కాదు వారి కుటుంబాలను పోషించుకునేందుకు కనీస వేతనం ఇచ్చేలా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. కార్మికులను ఓటు బ్యాంకు గానే చూస్తున్నారని, రాష్ట్రంలో 17మున్సిపల్ కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో 60 వేల మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారని, వారందరినీ రెగ్యులరైజ్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి కార్మికులకు వేతనాలు పెంచి నెలనెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీయూసీఐ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణ, కె.సూర్యం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రవీణ్, నాయకులు కిరణ్, యాకూబ్ షావలి, మల్లేషం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం, నారాయణ, కిరణ్, మహేందర్, గురువయ్య, నారాయణ, వెంకటేశ్వర్లు, కుమార్, యాదమ్మ, భూలక్ష్మి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నర్సయ్య

## జిల్లాస్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్ పరీక్షలు

**మహబూబాబాద్ అర్బన్:** ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, ఎస్‌సీఈఆర్‌టీ, తెలంగాణ భారతి ఫౌండేషన్ సహకారంతో ఈ నెల 21న జిల్లాస్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్ ప్రతిభ పరీక్షలు జిల్లా కేంద్రంలోని ఏకశిల హోలిఏంజిల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఈ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల పాఠశాలల 8, 9తరగతుల విద్యార్థులు హాజరుకావాలని డీఈఓ తెలిపారు.

## హలో.. ఆధార్ నంబర్ మీదేనా?

- ట్రాయ్ నుంచి ఫోన్ చేస్తున్నామని బెదిరింపు
- సీబీఐ అధికారి వాట్సాప్ డీపీతో సైబర్ మోసం
- రూ.95 వేలు పోగొట్టుకున్న మహిళ



మహబూబాబాద్ రూరల్ : హలో.. ఈ ఆధార్ నంబర్ మీదేనా? మేము ట్రాయ్ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి బెదిరింపులకు పాల్పడగా భయాందోళనకు గురైన ఓ మహిళ అవతలి వ్యక్తుల మాటలు నమ్మి రూ.95 వేలు పోగొట్టుకుంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సీబీఐ అధికారి వాట్సాప్ డీపీతో ఉన్న ఫోన్ నంబర్ నుంచి జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళకు ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఫోన్ కాల్ వచ్చింది. తాము ట్రాయ్ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నామని పలు రకాల బెదిరింపులతో కూడిన విషయాలను మాట్లాడి, ఆధార్ కార్డు నంబర్ చెప్పి అది మీదేనా అని సదరు మహిళను అడిగారు. ఆధార్ కార్డు నంబర్ తనదేనని చెప్పడంతో సైబర్ మోసగాళ్లు తమకు డబ్బులు పంపించాలని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన సదరు మహిళ రూ.95 వేలు ఫోన్‌పేకు బదిలీ చేసింది. కొంత సమయం తర్వాత ఆమె భర్త ఇంటికి రాగానే జరిగిన విషయాన్ని చెప్పడంతో ఆయన తన భార్య ఫోన్‌కు వచ్చిన ఫోన్ నంబర్‌కు కాల్ చేయడంతో అవతలి వ్యక్తుల నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో సైబర్ మోసానికి గురయ్యామని భావించిన సదరు మహిళ సైబర్ క్రైం నంబర్ 1930కి ఫోన్ చేసి విషయాన్ని తెలియజేసింది. ఫిర్యాదును స్వీకరించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేయమని సూచించారు. దీంతో నేడు బాధిత మహిళ మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. తమ ఆధార్ నంబర్ సైబర్ మోసగాళ్లకు ఎలా తెలిసిందని విచారం వ్యక్తం చేశారు.

## జవాన్ భూమి ఆక్రమణ.. నలుగురి రిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని కోమల్లలో భూఆక్రమణ కేసులో నలుగురిని రిమాండ్ చేసినట్లు రఘునాథపల్లి ఎస్సై దూదిమెట్ల నరేశ్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన పేరబోయిన రాజు జార్ఖండ్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన తండ్రి నర్సయ్య పేరు మీద గ్రామ శివారులోని చింతలగూడెంలో 409 సర్వే నంబర్‌లో 2.2 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈభూమిని ఆక్రమించాలని అదే గ్రామానికి చెందిన పేరబోయిన కొమురయ్య, పేరబోయిన రాజు, గోరంట్ల బలరాములు, మీర్జా సాఖత్ కలిసి జవాన్ తండ్రి నర్సయ్య మరణించాడని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించారు. 2018లో వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న జవాన్ ఇటీవల రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న నలుగురిని రిమాండ్‌కు తరలించగా.. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

## కుక్కల దాడిలో 80 నాటుకోళ్లు మృతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన బందెల వెంకటేశ్‌కు చెందిన నాటుకోళ్లు కుక్కల దాడిలో మృతి చెందాయి. బాధితుడి కథనం ప్రకారం.. ఆదివారం నాటుకోళ్లపై కుక్కలు దాడి చేయగా 80 వరకు కోళ్లు మృతి చెందాయన్నారు. వీటి విలువ సుమారు రూ.40వేల వరకు ఉంటుందన్నారు.



# జాగ్రత్తలే శ్రీరామరక్ష!

**పిల్లలకు యూట్యూబ్ అతిగా అలవాటు చేస్తే అనర్థమే**



యూట్యూబ్.. ఆధునిక కాలంలో ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అంటే తెలియనివారు ఉండరంటే అతిశయోక్తికాదమో. ఇందులో ప్రతీ ఒక్కరికి కావాల్సిన సమాచారం వీడియో, ఆడియో రూపంలో లభిస్తుంది. ప్రధానంగా పిల్లలకు పద్యాలు, వీడియో గేమ్‌లు అధిక సంఖ్యలో అందుబాటులో ఉంటాయి. అందుకే తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్‌లో పద్యాలు చూపిస్తూ యూట్యూబ్ అలవాటు చేస్తున్నారు. కానీ.. ఈ అలవాటు వల్ల భవిష్యత్‌లో జరిగే నష్టం ఆలోచించడం లేదు. యూట్యూబ్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లలపై దుష్ప్రభావం పడే వీలుంది. పిల్లలు అదేపనిగా యూట్యూబ్ చూస్తుంటే వారిని నియంత్రించే చర్యలేంటో తెలుసుకుందాం.

- స్క్రీన్‌కు ఎడిక్ట్ అయితే భవిష్యత్‌లో దుష్ప్రభావం
- తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు

కాజీపేట: అధిక శాతం పిల్లలు యూట్యూబ్‌లో వీడియో చూపిస్తే గానీ అన్నం తినమని మారం చేస్తుంటారు. ఆ సందర్భాల్లో తల్లిదండ్రులు ఏదోలా తింటే చాలు అని భావిస్తున్నారు. అయితే వారు తమ పిల్లలు పరోక్షంగా స్క్రీన్‌కు ఎడిక్ట్ అవుతున్నారనే విషయాన్ని గుర్తించడం లేదు. చిన్నవయసులోనే స్క్రీన్‌కు ఎడిక్ట్ అయితే భవిష్యత్‌లో దుష్పరిణామాలు తలెత్తుతాయి. వయసు పెరిగే కొద్దీ కుటుంబీకులు, స్నేహితులతో గడపడం తగ్గి, ఎప్పుడూ సోషల్ మీడియాలో గడుపుతారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు.

### ఎదిగే పిల్లలు వాడుతుంటే...

పిల్లల విషయం అలా ఉంచితే కొన్ని సందర్భాల్లో ఎదిగే పిల్లలు తల్లిదండ్రుల ఫోన్ వాడుతుంటారు. ఆ సమయంలో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా యూట్యూబ్ వంటి అప్లికేషన్లు మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ అనుసరిస్తుంటాయి. నిరంతరం ఎలాంటి వీడియోలు చూస్తుంటే వాటినే మళ్లీమళ్లీ చూపిస్తుంటాయి. సెన్సేషనల్ కంటెంట్ యూట్యూబ్‌లో చూసిన తర్వాత ఫోన్ పిల్లలకు ఇస్తే వారికి కూడా అవే వీడియోలు కనిపిస్తాయి. దీంతో వాళ్లకు కావాల్సిన ఇతర వీడియోల కోసం ప్రత్యేకంగా వెతుక్కోవాలి. ఎదిగే పిల్లలు మీ ఇంట్లో ఉంటే ఫోన్‌లో వారి కోసం సెకండ్ స్పేస్ వంటి యాప్స్ ద్వారా మరో యూట్యూబ్ ఇన్‌స్టాల్ చేసి ఇవ్వండి.

### ఆన్‌లైన్‌లో కోర్సులు..

యూట్యూబ్ ఒక్కటే కాదు. యూ డెమీ వంటి అనేక పోర్టల్‌లో వివిధ అంశాలకు సంబంధించి ఉచిత నామమాత్రపు రుసుంతో పెయిడ్ కోర్సులు లభిస్తుంటాయి. వాటిలో ఎన్‌రోల్ అవడం ద్వారా మీ పిల్లలు చిన్న వయసులోనే అనేక అంశాలకు సంబంధించి నైపుణ్యం పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. బ్రెయిన్ పవర్, మెమరీ పెంచుకోవడం, ప్రొడక్టివిటీ, టైమ్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, పర్సనల్ డెవలప్‌మెంట్, ఆర్ట్స్, క్రాఫ్ట్‌లకు సంబంధించిన కోర్సులు లభిస్తాయి.

### టైమ్ ట్రాకింగ్‌కు సరికొత్త యాప్స్...

అన్నిటికంటే సమయం విలువైంది. దీనిని ఎంత సమర్థవంతంగా వినియోగించుకోగలిగితే అంత అద్భుత ఫలితాలు సాధించొచ్చు. గంటల తరబడి కంప్యూటర్ చూసే వారు వీలైనంత ప్రొడక్టివ్‌గా ఉండేలా జాగ్రత్త వహించాలి. మనకు తెలియకుండానే టైం ఎక్కడ వృథా చేస్తున్నారో గమనించాలి. దీని కోసం అనేక టైం ట్రాకింగ్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.

**హబ్‌స్టఫ్..**

ఇది వివిధ వెబ్‌సైట్లను ఓపెన్ చేసిన తర్వాత వాటిపై మనం ఎంత సమయం గడుపుతున్నామనే వివరాలు చూపిస్తుంది. ఎప్పటికప్పుడు రాండమ్ స్క్రీన్ షాట్‌లను క్యాప్చర్ చేస్తుంది. కంప్యూటర్‌లో ఏ యాప్స్ ఎక్కువ వాడుతున్నారో రిపోర్ట్ చూపిస్తుంది.

**టోగెల్..**

ఇది కూడా రియల్ టైం ఇంటర్నెట్‌లో మీరు స్పెండ్ చేస్తున్న వివిధ అంశాల మీద టైమ్ రిపోర్టులు చూపిస్తుంది. మీ సమయాన్ని ప్రాజెక్టులు, టాగ్‌ల ఆధారంగా ఆర్గనైజ్ చేసుకోవచ్చు. టైమ్ షీట్లను ఎక్స్‌పోర్ట్ చేసుకోవచ్చు.

**హార్వెస్ట్..**

మార్కెట్‌లో బాగా పాపులర్ టైం ట్రాకింగ్ సర్వీస్ ఇది. డెస్క్‌టాప్ కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు చివరకు స్మార్ట్‌వాచ్‌ల్లో ఇది టైమ్ ట్రాకింగ్ సదుపాయాలు అందిస్తుంది. వెచ్చించిన సమయం ఆధారంగా క్లయింట్ల నుంచి నగదు వసూలు చేసే సంస్థలకు ఇది ఉపయోగపడుతుంది.

**ట్రాకింగ్ టైమ్..**

గూగుల్ క్రోమ్ ఎక్స్‌టెన్షన్ రూపంలో ఇది లభిస్తుంది. రోజు మొత్తంలో సమయం ఎలా వెచ్చిస్తున్నారనే విషయాన్ని ఇది రిపోర్ట్ రూపంలో చూపిస్తుంది. మెయిన్ స్క్రీన్‌లో టాస్క్‌లను క్రియేట్ చేసుకోవచ్చు. ఎడిట్ చేయొచ్చు. కొలాబరేట్ చేయొచ్చు.

### చిన్నారులకు ప్రత్యేక వీడియోలు..

చిన్నారులను ఆకర్షించేందుకు యూట్యూబ్ గేమింగ్ థీమ్ పోర్టల్ ట్విచ్‌తో డీల్ కుదుర్చుకుంది. దీనిప్రకారం 60 ఫ్రేమ్స్ ఫర్ సెకండ్ వీడియోలను యూట్యూబ్ పరిచయం చేసింది. వీడియో గేమ్స్‌తో సమానమైన ఫ్రేమ్స్ యూట్యూబ్‌లో అన్ని రకాల వీడియోలు కనిపిస్తాయి. వీటి వల్ల పిల్లల మనసు ప్రభావితమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా పిల్లల కోసం యూట్యూబ్ కిడ్స్ అప్లికేషన్ లభిస్తుంది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. పిల్లలకు ఫోన్ ఇవ్వాల్సి వచ్చినప్పుడు అప్లికేషన్‌ను ఓపెన్ చేసి ఇస్తే చాలు. ఈ అప్లికేషన్‌లో వివిధ రకాల పిల్లలకు ఉపయోగపడే ఎడ్యుకేషనల్ కంటెంట్ మాత్రమే లభిస్తుంది.

### అసభ్యకర వీడియోలు రాకుండా..

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా యూట్యూబ్‌లో కొన్నిసార్లు అసభ్యకర వీడియోలు కనిపిస్తుంటాయి. ఇవి రాకుండా ప్రత్యేకమైన సెట్టింగ్ ఉంటుంది. దీనిని ఎనేబుల్ చేయండి. మీ ఫోన్‌లో యూట్యూబ్ అప్లికేషన్ ఓపెన్ చేసి, అందులో సెట్టింగ్స్‌లో జనరల్‌లోకి వెళ్లి రొస్ట్రిక్టెడ్ మోడ్ అనే పదాన్ని ఎనేబుల్ చేయండి. దీంతో మీ ఇంట్లో ఎదిగే పిల్లలు చూడటానికి ఇబ్బందికరంగా ఉన్న వీడియోలు వాటంతట అవే డిజేబుల్ అవుతాయి.

### స్కిల్స్ పెంచుకోవడానికి..

యూట్యూబ్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్ చేసుకోవడానికి వివిధ సబ్జెక్టులకు సంబంధించిన నాలెడ్జ్ పెంచుకోవడానికి తోడ్పాడే అద్భుత వీడియోలు లభిస్తాయి. మీ పిల్లలు అలాంటి వీడియోలు చూడడం ద్వారా ప్రపంచంలోని గొప్ప యూనివర్సిటీలు, ప్రొఫెసర్ల సాయంతో తమ రంగాలకు సంబంధించిన సబ్జెక్టును నేర్చుకునే అవకాశం ఉంటుంది.

### యూట్యూబ్‌తో మంచీ, చెడు ఉన్నాయి



ప్రస్తుత రోజుల్లో పిల్లలు ఆటాపాటలు వదిలి సెల్‌ఫోన్ చూడడానికే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. యూట్యూబ్‌లో వచ్చే ప్రోగ్రామ్‌లు చూడడం అలవాటుగా మార్చుకున్నారు. ఇది సరికాదు. యూ ట్యూబ్‌తో లాభం ఎంత ఉందో..నష్టం కూడా అంతే ఉంది. చిన్న వయసులోనే స్క్రీన్‌కు అలవాటు పడితే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ విషయం గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను కనిపెడుతూ ఉండాలి

-డాక్టర్ పరికిపండ్ల అశోక్, మానసిక నిపుణుడు

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మంగపేట: ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు జిల్లా మంగపేట మండలంలోని సినిమాహాల్ వీధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై టీవీఆర్ సూరి తెలిపిన వివరాల ప్రకారం... సినిమాహాల్ వీధికి చెందిన తురక శ్రీరాములు (34) గత కొంత కాలంగా మద్యానికి బానిసై అతిగా మద్యం సేవిస్తుండటంతో భార్య వీరబద్ర భర్తతో గొడవ పడి హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఆదివారం ఉదయం శ్రీరాములు ఇంట్లో ఉరివేసుకోగా గమనించిన స్థానికులు ఉరిని తొలగించి ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారుడు ఉన్నారు. మృతుడి బావ గుంజ వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మనస్తాపంతో యువతి..



నవ్య మృతదేహం

చిట్యాల: మనస్తాపంతో ఉరి వేసుకుని యువతి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం ...జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన బుర్ర శ్రీధర్, సునీత దంపతుల కుమార్తె నవ్య (21) డిగ్రీ మొదటి సంవత్సరం వరకు చదివి మధ్యలోనే మానేసి ఇంటి వద్దనే ఉంటుంది. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో నిద్రించింది. ఆదివారం తెల్లవారు జామున మరోగదిలో పురుగుల మందు తాగి అనంతరం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా అప్పటికే మృతి చెందింది. కాగా గతంలో చల్లగరిగ గ్రామానికి చెందిన సిద్దు అనే వ్యక్తి ప్రేమ పేరుతో తన కూతురు ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్టులు చేస్తూ వేదిస్తున్నాడని గతంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేశారు. మళ్లీ అదే వ్యక్తి అలాగే ప్రవర్తించడంతో ఆ విషయాన్ని మనస్సులో పెట్టుకుని తమ కుటుంబ సభ్యుల పరువును తీస్తున్నాడని అప్పటి నుంచి మానసికంగా బాధపడుతున్న నవ్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

# మేడారం మినీ జాతరకు సిద్ధం

- పగిడిద్దరాజు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గంగారం : వచ్చే నెలలో నిర్వహించే మేడారం మినీ జాతరకు సర్వం సిద్ధం చేస్తున్నామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కేంద్రంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను మంత్రి సీతక్క, ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సమ్మక్క భర్త పగిడిద్దరాజు కొలువుదీరిన పూనుగొండ గ్రామం, ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే బయక్కపేట, కొండాయిలు, మేడారం, అయిలాపురం గ్రామాలతోపాటు గుంజేడు ముసలమ్మ జాతరలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. వచ్చే ఏడాది 2026లో జరిగే పెద్దజాతరకు ఇప్పటి నుంచి శాశ్వత పనులను చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్లనాయక్, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, మురళీధర్ రావు, ఐఎంఏ ప్రెసిడెంట్ వరంగల్ జగదీష్, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్, సీఐలు, ఎస్సైలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణ రెడ్డి, కొత్తగూడ, గంగారం మండలాల అధ్యక్షులు వజ్జ సారయ్య, వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దొంగల గుట్టు రట్టు

- రూ.4లక్షల విలువ చేసే ధాన్యం స్వాధీనం



ధాన్యం బస్తాలను చూపుతున్న పోలీసులు

నెల్లికుదురు: దొంగతనం జరిగి వారం రోజులు దాటక ముందే వరి ధాన్యం దొంగల గుట్టును రట్టు చేసి రూ.4 లక్షల విలువ చేసే ధాన్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై చిర్ర రమేశ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామ పరిధిలో పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా అశోక్ లేలాండ్ వాహనాన్ని తనిఖీ చేయగా వాహనంలో 50 ధాన్యం బస్తాలు ఉన్నాయి. రాయపర్తి మండలం కొత్తూరు జీపీకి చెందిన వాహన డ్రైవర్ హలావత్ సాగర్‌ను విచారించగా కేసముద్రం మార్కెట్‌లో బానోతు రాము, బానోతు నెహ్రూలకు ధాన్యం అమ్ముతున్నట్లు చెప్పారు. వారిని పూర్తిగా విచారించగా మేచరాజుపల్లిలో 50, తొర్రూర్‌లో 20, పూసపల్లిలో 30, ఇనుగుర్తిలో 20, రాయపర్తిలో 104, మొత్తం 4 దొంగతనాల్లో 359 ధాన్యం బస్తాలను కేసముద్రంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హలావత్ సాగర్, బానోతు నెహ్రూ, రాములతో పాటు 5గురు మైనర్లు మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# లలితా జ్యువెల్లరీ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎండీ కిరణ్‌కుమార్

హన్మకొండ చౌరస్తా: ప్రముఖ బంగారు, వజ్రాభరణాల షోరూం లలిత జ్యువెల్లరీ 57వ శాఖను హనుమకొండలో ఆదివారం ప్రారంభించారు. హనుమకొండలోని రాయపుర మెయిన్ రోడ్‌లో నూతన షోరూంను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా హాజరై లలిత జ్యువెల్లరీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ వ్యాపార రంగంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. లలిత జ్యువెల్లరీ లాంటి సంస్థల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బంగారు, వజ్రాభరణాల వ్యాపారంలో లలిత జ్యువెల్లరీ సంస్థ ఎండీ కిరణ్‌కుమార్‌ది ప్రత్యేక శైలి అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ లక్షలాది మంది ప్రజల మనసును గెలుచుకున్నారన్నారు. ప్రకటనలకు కోట్ల రూపాయలు చెల్లించాల్సిన పనిలేకుండా తానే స్వయంగా నటిస్తూ బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఆధునిక డిజైన్లలో రూపొందించిన ఆభరణాల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా లలిత జ్యువెల్లరీ అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. లలిత జ్యువెల్లరీ సంస్థ చైర్మన్, ఎండీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తను పేద కుటుంబంలో జన్మించానని, సాధారణ వ్యక్తికి సరైన ధరల్లో నగలు కొనడమనేది ఓ పెద్ద చాలెంజ్ అనే విషయం బాగా తెలుసన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బు విలువ తనకు బాగా తెలుసన్నారు. అందుకోసమే కస్టమర్లకు నేను అవగాహన కల్పిస్తుంటానని కిరణ్‌కుమార్ తెలిపారు.



బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న అతిథులు



# మిద్దె తోటల సాగు ఆరోగ్యదాయకం

- మానుకోట జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి మరియన్న



మిద్దె తోటల సాగును పరిశీలిస్తున్న మరియన్న

మహబూబాబాద్ రూరల్: మిద్దె తోటల సాగు ఆరోగ్యదాయకమని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. మిద్దె తోటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన బానోత్ రామచందర్, సునీత నివాసంలో కూరగాయలు, పండ్ల సాగును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు రకాల వ్యాధుల బారి నుంచి రక్షణకు విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు మొదలైనవి అవసరమని సూచించారు. కుటుంబ అవసరాలకు సాగు చేసుకుని మంచి ఆరోగ్యం పెంపొందించుకోవాలని, రోగ నిరోధక శక్తి, కేన్సర్ రహిత సమాజం కోసం మిద్దె తోటలు సాగు చేయాలన్నారు. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు మొదలైన వాటితో పాటుగా ఔషధ మొక్కలు, పూలు తదితర వాటిని ప్రతీ ఇంటిలో పెరటి ఆవరణ, మిద్దెల మీద సాగు చేసుకోవాలన్నారు. మానుకోట జిల్లాలోని మహబూబాబాద్ పట్టణంతో పాటు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, తదితర మండల కేంద్రాల్లో మిద్దెల మీద అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, మునగ, కరివేపాకు, పండ్లు, పూలు, ఔషధ మొక్కలు సాగు చేస్తున్నారన్నారు.

**సేంద్రియ ఎరువులు వాడుకోవాలి..**

మిద్దె తోటల సాగులో ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా కేవలం సేంద్రియ ఎరువులయిన పశువుల ఎరువు, వర్మికంపోస్ట్, వేప పిండి, వేపనూనె, కానుగ పిండి తదితర ఆర్గానిక్ ఉత్పత్తులనువాడి మిద్దె తోటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ద్వారా మిద్దె తోటలు పెంచేందుకు అన్నిరకాలుగా సాంకేతిక సూచనలు తెలియజేస్తున్నామన్నారు. మహబూబాబాద్ పట్టణంలో జామ, వాటర్ ఆపిల్, అవకాడో, స్టార్ ఫ్రూట్, స్వీట్ చింత, బార్బొడాస్ చెర్రీస్, మలబ్రీ, మామిడి, స్వీట్ లైమ్, దానిమ్మ, టేబుల్ నిమ్మ, బత్తాయి, మియాజకి మామిడి, పునాస మామిడి, అరటి, పైన్ ఆపిల్ (అనాస) పెంచుతున్నారని వివరించారు. అదే విధంగా బెండ, బీర, సొర, కాకర, దొండ, బోడ కాకర, టమాటా, పచ్చి మిర్చి, చిక్కుడు, దోస, పలురకాల ఆకు కూరలు, సుగంధ ద్రవ్యాలైన పసుపు, ఉల్లి, వెల్లుల్లి, అల్లం, ఔషధ మొక్కలు, పూల మొక్కలు కూడా ఇంటి అవసరాలకు అనుగుణంగా సాగు చేస్తున్నారన్నారు.

# నల్లబెల్లం, పటిక స్వాధీనం

- వివరాలు వెల్లడించిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : రైలులో అక్రమంగా తరలిస్తున్న 7 క్వింటాళ్ల నల్లబెల్లం, 75 కిలోల పటిక స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, మరో నలుగురు అనుమానిత వ్యక్తుల కోసం గాలింపు చేస్తున్నామని మహబూబాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని తెలిపారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలోని ఆర్పీఎఫ్ స్టేషన్ కార్యాలయంలో వరంగల్ ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ముతికేడ్ ప్రాంతం నుంచి పలువురు వ్యక్తులు నల్లబెల్లం, పటిక బస్తాలను నాందేడ్ నుంచి సంబల్పూర్ వైపునకు వెళ్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలులో తీసుకొస్తున్నారు. రైలు ఇంటికన్నె రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్న క్రమంలో జనరల్ బోగీ నుంచి కొందరు బెల్లం, పటిక బస్తాలను పట్టాల వెంబడి పడవేశారు. ఈ క్రమంలో అదే బోగీలో ఉన్న ప్రయాణికులు సదరు వ్యక్తులను పట్టుకోగా.. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న బెల్లం, పటిక బస్తాలకు సంబంధించిన వారి బంధువులు రైలు బోగీ వద్దకు చేరుకుని ప్రయాణికులపై, రైలు బోగీపై రాళ్లు రువ్వారు. వరంగల్ ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, జీఆర్పీ ఎస్సై సురేష్ చేరుకుని ముగ్గురు నిందితులు, 14 బస్తాల (7 క్వింటాళ్ల) నల్లబెల్లం, 3 బస్తాల (75 కిలోల) పటికను స్వాధీనం చేసుకుని మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు తరలించామన్నారు. ఈఘటనలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చెరువుకొమ్ము తండాకు చెందిన ధరావత్ బాలు, హక్యా తండాకు చెందిన బానోతు రాజేందర్, ఇస్లావత్ తండాకు చెందిన ధరావత్ భద్రును అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆ ముగ్గురితోపాటుగా చెరువుకొమ్ము తండాకు చెందిన భద్రు, శివపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

**160 కేజీల బెల్లం పట్టివేత**

కేసముద్రం: మండల కేంద్రంలోని శివారు బ్రహ్మంగారితండా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 160 కేజీల బెల్లం, 20 కేజీల పటిక, 5 లీటర్ల నాటుసారాను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు ఎక్సైజ్ శాఖ సీఐ భిక్షపతి తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



గోపి (ఫైల్)

రాయపర్తి: విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్యతండాలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దారావత్ హన్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. తనకున్న రెండెకరాల్లో ఉమ్మడి కుటుంబంగానే వరి పొలం సాగు చేస్తున్నారు. ఆదివారం నాటు వేస్తున్న క్రమంలో చిన్న కుమారుడు ధరావత్ గోపి (28) తన బోరు మోటారుకు ఉన్న వైరు కిందకు ఉండడంతోపాటు పేలి ఉండడాన్ని గమనించలేదు. ప్రమాదవశాత్తు వైరుగోపికి తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడుకి భార్య ఉంది. గోపి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### దంతాలపల్లిలో యువకుడు..



అనిల్ (ఫైల్)

దంతాలపల్లి: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల శివారు గోప్యాతండాలో ఆదివారం చోటుచేసుకుంది. తండావాసుల వివరాల ప్రకారం... బానోత్ బాలు, సరోజా దంపతుల కుమారుడు అనిల్ (16) జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం కావడంతో తల్లిదండ్రులతో కలిసి పొలం పనులు చేసి సాయంత్రం ఇంటికి వచ్చాడు. తన ఒంటిపై ఉన్న తడిబట్టలు విప్పి ఇంటి ముందు ఉన్న రేకులపై వేశాడు. ఈ క్రమంలో అనిల్‌కు విద్యుత్‌షాక్ గురై పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో తండాలో విద్యుత్ శాఖలో విధులు నిర్వహించే సురేశ్ అక్కడికి చేరుకుని సీపీఆర్ చేశాడు. అనంతరం తొర్రూరులోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.